

టన్ను చీనీ రూ.25,290

అనంతపురం మార్కెట్ లో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25,290 కనిష్టం రూ.10 వేల ప్రకారం విక్రయాలు జరిగాయి.



గుంతకల్లు డీఆర్ఎంగా గుప్తా

గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్‌గా సీఎస్ గుప్తా నియమితులయ్యారు. ప్రస్తుత డీఆర్ఎం విజయ్‌కుమార్‌ను బదిలీ చేసినా ఎక్కడా పోస్టింగ్ కల్పించలేదు.

గరిష్టం/కనిష్టం
$32.4^{\circ}/20.6^{\circ}$

జిల్లా అంతటా గురువారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు, చలి తీవ్రత తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

'గ్రౌండ్ వాటర్' ఇన్‌చార్జ్ డీడీగా జయరామిరెడ్డి



బాధ్యతలు చేపట్టిన జయరామిరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: భూగర్భ జలశాఖ (గ్రౌండ్ వాటర్) ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా జయరామిరెడ్డి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ డీడీగా ఉన్న కె.తిప్పేస్వామి వ్యక్తిగత కారణాలతో నెల రోజుల పాటు సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఇరిగేటెడ్ గ్రౌండ్‌వాటర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన జయరామిరెడ్డికి బాధ్యతలు అప్పజెబుతూ ఆ శాఖ రాష్ట్ర డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో స్థానిక ఆ శాఖ కార్యాలయంలో జయరామిరెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 2, 3 తేదీల్లో కేంద్ర బృందం రానుండటంతో కరువు జాబితాలో ప్రకటించిన 7 మండలాల్లో భూగర్భజలాల స్థితిగతుల వివరాలు, అలాగే గత వంద సంవత్సరాల వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితిపై ఫొటో ప్రదర్శన ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే నెలవారీగా ఫిజీమీటర్ల నుంచి నీటిమట్టం సేకరణ, వాల్టా చట్టం అమలు తదితర వాటిపై దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షునిగా శ్రీనివాసులు నాయక్

- పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా భోగతి విజయ ప్రతాప్ రెడ్డి


అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షునిగా యం. శ్రీనివాసులు నాయక్(శింగనమల నియోజకవర్గం) నియమితులయ్యారు. అలాగే, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా భోగతి విజయ ప్రతాప్ రెడ్డి(శింగనమల)ని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

నేడు బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక



బత్తలపల్లి: స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో శుక్రవారం ఉమ్మడి అనంతపురం జిల్లా బాలబాలికల జూనియర్స్ కబడ్డీ జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.రామ్‌తేజ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సంపత్ కుమార్, కార్యదర్శి రాగిరి రామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి మూడో తేదీ నుంచి ఐదో తేదీ వరకు కర్నూలు కేఈ ఫామ్ హౌస్‌లో 50వ మూలపురి రంగారావు మెమోరియల్ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపిక ప్రక్రియ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల క్రీడాకారులు ఇందులో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. బాలుర బరువు 70 కేజీలు, బాలికలు 65 కేజీలలోపు ఉండాలని, ఒరిజనల్ పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. ఎంపిక పోటీలు మ్యాట్‌పై నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు మ్యాట్ షూ ధరించాలని తెలిపారు.

కోలుకోలేని షాక్



ఎనిమిది మాసాల క్రితం ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు రాప్తాడుకు వచ్చారు. "కరెంటు చార్జీలు పెంచను. మీ పొలంలో మీరే కరెంటు ఉత్పత్తి చేసుకుని వేరే వాళ్లకు అవసరమైతే ఇవ్వొచ్చు" అంటూ అలవిగాని హామీలు గుప్పించారు. కానీ పాలనా పగ్గాలు చేపట్టి ఆరు మాసాలు గడవకముందే కోలుకోలేని 'షాక్' ఇచ్చారు. సామాన్యుల నడ్డి విరుస్తూ కరెంటు చార్జీల భారం మోపారు. కూటమి సర్కారు నిర్ణయాలకు సామాన్యులే కాకుండా పారిశ్రామిక వేత్తలు, రైతులు కూడా విలవిలలాడుతున్నారు.

- చుక్కలు చూపుతున్న బాబు
- విద్యుత్ చార్జీల పెంపుతో సామాన్యుల విలవిల
- వ్యవసాయ కనెక్షన్ల కోసం రైతుల ఎదురుచూపు
- విద్యుత్ స్తంభాలు, కండక్టర్‌లూ అందించని కూటమి ప్రభుత్వం
- కేబుల్ లేక నిలిచిన 636 కిలోమీటర్ల పనులు
- అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ వ్యవస్థతో అన్ని వర్గాలకూ కష్టాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీల పెంచడంతో 6.22 లక్షల కుటుంబాలపై తీవ్ర భారం పడింది. ఒక్కసారిగా బిల్లు రెండింతలు పెరగడంతో సామాన్యులు ఘొల్లుమంటున్నారు. ఎన్నికల ముందు చార్జీలు పెంచబోమంటే ఎంతో సంతోషించామని, కానీ, నేడు మోయలేని భారం మోపి చుక్కలు చూపిస్తున్నారని వాపోతున్నారు. బిల్లు కట్టడం నాలుగు రోజులు ఆలస్యమైతే కరెంటు కనెక్షన్ తొలగిస్తుండటంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతా అస్తవ్యస్తం..

గడిచిన ఐదేళ్లలో పెద్ద ఎత్తున సంస్కరణలు చేపట్టారు. కరెంటు కోతల్లేకుండా నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేశారు. కొత్త లైన్లు, కొత్త సబ్ స్టేషన్లు ఇలా ఒకటేమిటి రమారమి ఐదేళ్లలో రూ.1,642 కోట్లు ఖర్చు చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. కరెంటు స్తంభాలకు కూడా దిక్కులేని పరిస్థితి. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం సుమారు 24,600 విద్యుత్ స్తంభాలు అవసరం ఉండగా, వాటిని ఏర్పాటు చేయడానికి డబ్బుల్లేవని చెబుతున్న దుస్థితి. ఇక 2,149 కిలోమీటర్ల మేర కండక్టర్‌లు లేవని విద్యుత్ శాఖ తేల్చింది. అంతేకాదు విద్యుత్ కేబుల్ లేక 636 కిలోమీటర్ల మేర పనులు స్తంభించిపోయాయి. వ్యవసాయ కనెక్షన్ల మంజూరులో తీవ్ర జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు పోళ్లు, కేబుల్, కండక్టర్లు అందించడంలో అంతులేని అలసత్వం వెరసి ఆరు మాసాల్లోనే విద్యుత్ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిన పాపం కూటమి సర్కారుదేనని సామాన్యులు వాపోతున్నారు.

విద్యుత్ కనెక్షన్లు, కావాల్సిన ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలు ఇలా..

నియోజకవర్గం	కనెక్షన్లకు డబ్బు కట్టిన రైతులు	ట్రాన్స్‌ఫార్మర్ల అవసరం
గుంతకల్లు	669	184
కళ్యాణదుర్గం	2,107	532
రాప్తాడు	1,128	303
రాయదుర్గం	2,165	655
శింగనమల	1,324	473
తాడిపత్రి	711	225
ఉరవకొండ	2,216	648

2019-2024 మధ్య కాలంలో విద్యుత్ సంస్కరణలు ఇలా..


కేటగిరీ	సంఖ్య	వ్యయం రూ.కోట్లలో
వ్యవసాయ కనెక్షన్లు	94,060	--
ట్రాన్స్‌ఫార్మర్లు	9612	270
సబ్‌స్టేషన్లు	46	161
పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	114	53.76
33కేవీ ఫీడర్లు	11	40.26
11కేవీ ఫీడర్లు	19	13.93
33కేవీ లైను	42.4 కి.మీ	98.83
హౌసింగ్ కాలనీలు	349	88.32
11 కేవీ ఫీడర్లు	593	1334
33కేవీ కొత్త ఫీడర్లు	579.5 కిమీ	50.6
కొత్త సబ్‌స్టేషన్ల ప్రతిపాదన	273	955.5

చార్జీల బాదుడుపై నేడు వైఎస్సార్ సీపీ పోరుబాట



అనంతపురం కార్పొరేషన్: విద్యుత్ చార్జీలను భారీగా పెంచిన కూటమి ప్రభుత్వంపై పోరాటానికి వైఎస్సార్ సీపీ సిద్ధమైంది. శుక్రవారం జిల్లావ్యాప్తంగా 'విద్యుత్ పోరుబాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అనంతపురం, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, రాప్తాడు ప్రాంతాల్లో పార్టీ సమన్వయకర్తల ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. పార్టీ శ్రేణులు, ప్రజలతో ర్యాలీగా వెళ్లి విద్యుత్ అధికారులకు వినతి పత్రం ఇవ్వనున్నారు.

జయప్రదం చేయాలి



'వైఎస్సార్ సీపీ పోరుబాట' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు ఆరు నెలల్లోనే ప్రజలపై రూ.15వేల కోట్లకుపైగా భారం మోపారన్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములై ఉండీ, ఇలా వ్యవహరించడం దారుణమన్నారు. టీడీపీ వారు కూడా కరెంటు చార్జీలను తగ్గించాలని కోరుతున్నారన్నారు. ప్రభుత్వాన్ని మేలుకొలుపే విధంగా వైఎస్సార్ సీపీ కదం తొక్కుతోందని, కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నియోజకవర్గాల వారీగా పోరుబాట కార్యక్రమాల వివరాలిలా..

నియోజకవర్గం	ప్రారంభ స్థలం	సమయం
అనంతపురం	పాతూరులోని బ్రహ్మంగారి గుడి	ఉదయం 10 గంటలు
శింగనమల	ఆర్టీసీ బస్టాండ్ వద్ద వైఎస్సార్ విగ్రహం	ఉదయం 10
గుంతకల్లు	టీవీటవర్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం	ఉదయం 10
ఉరవకొండ	ఉరగాద్రి కల్యాణమండపం	ఉదయం 9
రాయదుర్గం	వినాయక సర్కిల్	ఉదయం 10
కళ్యాణదుర్గం	వైఎస్సార్ సీపీ కార్యాలయం	ఉదయం 10
తాడిపత్రి	వైఎస్సార్ విగ్రహం	ఉదయం 10
రాప్తాడు	వైఎస్సార్ విగ్రహం	ఉదయం 9

భయమేస్తోంది



నా ఇంటికి గతంలో ప్రతి నెలా రూ. 250 నుంచి రూ. 300 వరకు కరెంట్ బిల్లు వచ్చేది. రెండు నెలల క్రితం నుంచి బిల్లు రూ. 600 నుంచి రూ.700 వరకూ పెరిగింది. బిల్లులు చూస్తే భయమేస్తోంది. చిరు వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు భరించడమే కష్టంగా ఉన్న సమయంలో కరెంట్ బిల్లులు ఒక్కసారిగా రెండింతలు చేసి మోయలేని భారం వేశారు. కరెంట్ చార్జీలు పెంచబోమని గతంలో చెప్పి నేడు పెంచడం మోసం చేయడమే అవుతుంది.

– కరీంబాషా, కూడేరు

బిల్లు ముట్టుకుంటే షాకే



అరకొర జీతంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. గత ప్రభుత్వంలో నా ఇంటికి రూ. 250 మేర కరెంటు బిల్లు వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వంలో కరెంటు బిల్లు రూ.400 చేరింది. నా కుటుంబం ఒక్కటే కాదు. చాలా మంది పేద ప్రజలు బాధపడుతున్నారు. కరెంట్ వైరును కాదు.. ప్రస్తుతం బిల్లును ముట్టుకున్నా షాక్ కొడుతోంది.

–రాజు, ఆసుపత్రి కాలనీ, యాడికి మండలం

ఇదేం బాదుడు బాబు..



అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోనని ప్రకటించిన చంద్రబాబు ప్రజలను మోసం చేశారు. రూ.15,450 కోట్ల భారాన్ని మోపిన ఆయనను ఇదేం బాదుడని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గుంతకల్లులో దుకాణాలకు స్మార్ట్‌మీటర్లు బిగించారు. త్వరలో ఇళ్లకు కూడా బిగిస్తారట. పేదల కడుపుకొట్టి అదానీ లాంటి పెద్దల పొట్ట నింపేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం చేస్తున్న ఈ దుశ్చర్యను ఖండిస్తున్నాం.

– సాకే నాగరాజు, సీఐటీయూ కార్యదర్శి, గుంతకల్లు

సమాధానం ఇవ్వడం లేదు



గత ప్రభుత్వంలో కరెంట్ బిల్లు రూ. 300 కంటే ఎక్కువ వచ్చేది కాదు. వ్యవసాయ మోటార్ బిల్లు, ఇంటి కరెంట్ బిల్లు కలిపి అంత వస్తుండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 3 నెలల నుంచి బిల్లు రూ. 650 దాటుతోంది. దీంతో చాలా ఇబ్బందిగా ఉంది. సగానికి పైగా బిల్లు ఎందుకు ఎక్కువ వస్తోందని విద్యుత్ అధికారులను అడుగుతుంటే సమాధానం ఇవ్వడం లేదు.

– నాగలింగారెడ్డి, గోవిందపల్లి, బుక్కరాయసముద్రం మండలం

30 నుంచి దేహదారుఢ్య పరీక్షలు

అనంతపురం: స్థానిక నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ఈ నెల 30 నుంచి పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. జనవరి 17వరకూ ప్రక్రియ సాగనుంది. పురుష అభ్యర్థులు 5,242, మహిళా అభ్యర్థులు 1,237 మంది మొత్తం 6,749 మంది హాజరుకానున్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను అభ్యర్థులు తీసుకురావాల్సి ఉంటుంది.

పకడ్బందీగా ప్రక్రియ..

దేహదారుఢ్య పరీక్షల నిర్వహణపై పోలీసు అధికారులు, ఐటీ కోర్ టీంతో ఎస్పీ పి. జగదీష్ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏపీ స్టేట్ లెవల్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏపీఎస్ఎల్ఆర్‌బీ) ఆదేశాలు, నియమ నిబంధనల మేరకు పరీక్షలు సవ్యంగా జరిగేలా ప్రణాళి సిద్ధం చేశామన్నారు. పొరపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సర్టిఫికెషన్ వెరిఫికేషన్ నుంచి బయోమెట్రిక్ అథెంటిఫికేషన్, దేహదారుఢ్య పరీక్షలు, ఆర్ఎఫ్ ఐడీ ట్యాగుల పంపిణీ, 1,600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, వెరిఫికేషన్స్ 2 (స్పెషల్ బెనిఫిట్స్, లోకల్ స్టేటస్), రిజల్ట్ కౌంటర్ వరకు సమగ్రంగా విధులు నిర్వర్తించాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఇలియాజ్ బాషా, డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్, రవిబాబు, శ్రీనివాస్, రామకృష్ణుడు, నీలకంఠేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ జగదీష్

గోడౌన్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ శాఖ, సహకారశాఖ సంయుక్తంగా చేపట్టిన మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ గోడౌన్ల నిర్మాణాలు టార్గెట్ మేరకు పూర్తి చేసి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)కు అప్పగించాలని మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ విజయసునీత ఆదేశించారు. గురువారం జిల్లాకు విచ్చేసిన డైరెక్టర్ రెండు జిల్లాల పరిధిలో చేపట్టిన గోడౌన్ల గురించి తెలుసుకున్నారు. అనంతపురం జిల్లాలో 101 గోడౌన్లకు గానూ 53 పూర్తి చేసి, అందులో 46 గోడౌన్లను పీఏసీఎస్‌లకు అప్పగించినట్లు తెలిపారు. అలాగే శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 87 గోడౌన్లకు గానూ 60 పూర్తి చేసి అందులో 50 గోడౌన్లకు పీఏసీఎస్‌లకు అప్పగించామని డీఈ రఘునాథ పేర్కొన్నారు. ఒక్కో గోదాము నిర్మాణానికి రూ.40 లక్షలు వెచ్చించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ విజయసునీత మాట్లాడుతూ మిగిలిన గోడౌన్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సొసైటీలు ఆర్థికంగా బలోపేతం కావడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడా వృథాగా ఉండకుండా వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు లేదా ఇతరత్రా అద్దె ప్రాతిపదికన ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం పాలసముద్రం, మరూరు, ఏ.నారాయణపురంలో నిర్మించిన గోదాములను పరిశీలించారు. కాగా, జిల్లాకు విచ్చేసిన మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీతను అనంతపురం ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ సి.రామాంజినేయులు, డీడీ శ్రీకాంత్‌రెడ్డి, ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, ఎల్ఎన్ మూర్తి, పీఏసీఎస్ సీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

'కరువు' నివేదిక సిద్ధం చేయండి

- అధికారులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: 'కరువు పరిస్థితులు అంచనా వేసేందుకు జిల్లాకు కేంద్ర బృందం విచ్చేయనుంది. జనవరి 2, 3 తేదీల్లో జిల్లాలో బృందం పర్యటిస్తుంది. ఈ నేపథ్యంలో సమగ్ర వివరాలతో నివేదిక సిద్ధం చేయండి' అని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ అనంతపురం, నార్పల, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, యాడికి, విడపనకల్లు మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించారన్నారు. అప్పటి కరువు పరిస్థితులను అంచనా వేసేందుకు కేంద్ర బృందం రెండు రోజుల పాటు ఆయా మండలాల్లో పర్యటించనుందన్నారు. ఈ దృష్ట్యా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. బృందం సభ్యులకు వసతి, వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. కరువు పరిస్థితి తెలియజేసేలా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కరువు మండలాల్లో కేంద్ర బృందం పర్యటనకు సంబంధించి రూట్ మ్యాప్ తయారు చేయాలని ఆదేశించారు. కరువు మండలాల్లో తాగునీటి సమస్యలు, జల్ జీవన్ మిషన్ పనులు, ఉపాధి హామీ కింద లేబర్ బడ్జెట్ తయారీ, పనుల కల్పన, భూగర్భజలాల పరిస్థితి తదితర వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమన్వయంతో పని చేసి కేంద్ర బృందం పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్ఓ ఎ.మలోల, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, సీపీఓ అశోక్‌కుమార్, డ్వామా పీడీ సలీం బాషా, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఉద్యాన శాఖ డీడీ నరసింహరావు, డీపీఎం ఆనంద్, హెచ్ఎల్‌సీ ఎస్ఈ రాజశేఖర్, భూగర్భజల శాఖ ఏడీ జయరామిరెడ్డి, ఐసీడీఎస్ పీడీ వనజ అక్కమ్మ, ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వే వేగవంతం చేయాలి

"ఎంఎస్ఎంఈ యూనిట్ల సర్వే చేయడంలో మీ పనితీరు సరిగ్గా లేదు. నవంబరు 29న ప్రారంభమైతే ఇప్పటికీ 18 శాతం మాత్రమే పూర్తయ్యింది. ఇలాగైతే ఫిబ్రవరి 1వ తేదీకి ఎలా పూర్తి చేస్తారు." అంటూ ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అసహనం వ్యక్తం చేశారు. ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి డీఎల్‌డీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి, డీసీఓ, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 89,500 ఎంఎస్ఎంఈ యూనిట్లు ఉంటే ఇప్పటి వరకు 14 వేలు యూనిట్ల సర్వే జరిగిందన్నారు. ఎంఎస్ఎంఈ సర్వేతో పరిశ్రమలు, సేవారంగాలు, వ్యాపార సంస్థలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. బ్యాంకు రుణం పొందడానికి అర్హులవుతారన్నారు. 'ఉద్యమ్' పోర్టల్‌లో యూనిట్ వివరాలు నమోదు చేయడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీలు పొందడానికి వీలవుతుందన్నారు. ఈ విషయాన్ని యూనిట్ల యజమానులకు తెలియజేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, డీసీఓ అరుణకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మన్మోహనం.. మరువలేని జ్ఞాపకం

- ఉమ్మడి జిల్లాతో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ప్రత్యేక అనుబంధం
- ఇక్కడి నుంచే జాతీయ ఉపాధి హామీ పథకం ప్రారంభం



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న మన్మోహన్ సింగ్, దివంగత నేత వైఎస్సార్ (ఫైల్)



సత్యసాయి విద్యాసంస్థల 29వ స్నాతకోత్సవంలో బాబాతో మన్మోహన్ సింగ్ (ఫైల్)

శింగనమల/ ప్రశాంతి నిలయం: మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణవార్త విన్న జిల్లావాసులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మన్మోహన్‌తో ఉమ్మడి జిల్లాకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించేందుకు 2006లో అప్పటి యూపీఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎన్ఆర్ఈజీఎస్) తీసుకువచ్చింది. అదే ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన ఈ పథకాన్ని అనంతపురం జిల్లా నార్పల మండలం బండ్లపల్లి నుంచే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాని హోదాలో మన్మోహన్‌సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బండ్లపల్లికి వచ్చారు. ఆ సందర్భంగా ప్రధాని మన్మోహన్‌సింగ్ కూలీలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా రాగి సంకటి ఆరగించి సంతృప్తి వ్యక్తం చేశారు.

సత్యసాయి ప్రియ భక్తుడు

సత్యసాయి అంటే డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు అమితమైన ఇష్టం. సత్యసాయిపై ఉన్న భక్తిభావనతో పలుమార్లు పుట్టపర్తిని సందర్శించారు. దేశ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు 1995 నవంబర్ 22న ప్రశాంతి నిలయంలో నిర్వహించిన సత్యసాయి విద్యాసంస్థల 14వ స్నాతకోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ప్రధాని హోదాలో 2010 నవంబర్ 22న 29వ స్నాతకోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై సందేశాన్నిచ్చారు. సత్యసాయి నిర్యాణం చెందడంతో ప్రధాని హోదాలో 2011 ఏప్రిల్ 26న ప్రశాంతి నిలయం చేరుకుని పార్థివ దేహానికి నివాళులర్పించారు. చివరగా 2016లో ప్రశాంతినిలయం సందర్శించారు. మన్మోహన్‌సింగ్ మరణం బాబా భక్తులను సైతం కలచివేసింది.

క్లుప్తంగా

మన్మోహన్ సింగ్ మృతికి అనంత సంతాపం

అనంతపురం కార్పొరేషన్: మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ గురువారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో మన్మోహన్ సింగ్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. భారతదేశానికి 14వ ప్రధానమంత్రిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా పనిచేసిన ఆయన అంతకుముందు కేంద్ర ఆర్థిక మంత్రి , ఆర్థిక కార్యదర్శిగానూ పనిచేశారన్నారు. పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థను సరళీకృతం చేయడంలో మన్మోహన్ సింగ్ ముఖ్యమైన పాత్ర పోషించారన్నారు. తన పదవీ కాలమంతా సభకు హాజరు కావడం ఆయన అంకిత భావానికి నిదర్శనమన్నారు. ఆరోగ్యం సహకరించకున్నా వీల్ చైర్‌లో పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యేవారన్నారు. దేశంలో ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా గుర్తింపు పొందారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి హామీ కల్పించే చట్టం చేయాలని సుదీర్ఘకాలం పాటు కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తూ వచ్చాయని, ఇది మన్మోహన్ సింగ్ నాయకత్వంలో సాకారమైందన్నారు. దేశంలోనే తొలిసారిగా ఉపాధి హామీ పథకాన్ని అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం పరిధిలోని బండ్లపల్లిలో ప్రారంభించారని గుర్తు చేశారు.

ఫారిన్ లాంగ్వేజెస్‌పై ఆన్‌లైన్ కోర్సు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ అనిత గౌడ్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వేదికగా ఆర్డీటీ ప్రొఫెషనల్ స్కూల్ ఆధ్వర్యంలో ఫారిన్ లాంగ్వేజెస్‌పై ఆన్‌లైన్ కోర్సును గురువారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ బొమ్మగాని అనితగౌడ్ ప్రారంభించారు. స్పానిష్, జర్మన్, పోర్చుగీసు, ఫ్రెంచ్ బాషలపై ఆసక్తి చూపిన 150 మంది విద్యార్థులకు అడ్మిషన్ కల్పించారు. ఆన్‌లైన్ కోర్సులకు సంబంధించి ల్యాప్‌టాప్, శిక్షణను ఆర్డీటీ సంస్థ ఉచితంగా అందజేస్తోంది. కోర్సు పూర్తి చేసిన వారికి పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి పీజీ డిప్లొమా సర్టిఫికెట్‌ను ఎస్కేయూ అందజేస్తుంది. కార్యక్రమంలో ఎస్కేయూ స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.నాగభూషణరాజు, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

హిమోదయం.. జీవన సమరం

చలివేస్తే ఎవరైనా సరే.. కాళ్లు ముడుచుకుని వెచ్చగా ఇంట్లో పడుకోవాలనుకుంటారు. కానీ రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలు చలి వణికించినా కడుపునింపే నాలుగు మెతుకుల కోసం వేకువజామునే రోడ్డెక్కుతున్నారు. హిమోదయంలోనూ జీవన సమరం చేస్తున్నారు. స్వేదం చిందిస్తూ చలికే గిలిగింతలు పెడుతున్నారు. గురువారం తెల్లవారుజామున అనంతపురంలో కనిపించిన ఈ చిత్రాలు పేదల బతుకుపోరుకు అద్దం పడుతున్నాయి. శ్రమైక జీవన సౌదర్యానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అనంతపురంలోని జెడ్పీ కార్యాలయం ఎదుట వేకువజామున భిక్షమెత్తుకుంటున్న అంధుడు



కూలి పనులు కల్పించే కాంట్రాక్టర్ కోసం ఎదురు చూస్తున్న కూలీలు



తెల్లవారుజామున చలిలోనే పనుల కోసం వస్తున్న కూలీలు





రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికురాలు



పాలు విక్రయిస్తున్న పాడిరైతు

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

• ఉద్యానశాఖ డీడీ నరసింహారావు

అనంతపురం అగ్రికల్చర్: వరుస తుఫాన్లు, మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా మామిడి తోటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు సూచించారు. ఆత్మకూరు, గార్లదిన్నె మండలాల్లో రైతుల మామిడి తోటలను హెచ్‌ఓ రత్నకుమార్‌తో కలసి గురువారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం మామిడి తోటలు పూమొగ్గ, పచ్చిపూత, పూత దశ లాంటి కీలకదశలో ఉన్నాయన్నారు. మంచి దిగుబడుల కోసం సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 10 వేల హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయన్నారు. తుఫాన్ల వల్ల చిరుజల్లులు, ఉష్ణోగ్రతలు తగ్గడం, మబ్బులు, ముసురు లాంటి వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రసంపీల్చు పురుగు ఉధృతి పెరిగే అవకాశముందన్నారు. పూమొగ్గ దశలో ఉన్న తోటల్లో తేనెమంచు పురుగు, పక్షికన్ను తెగులు, బూడిద తెగులు నివారణకు లీటర్ నీటికి 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ + 2 మి.లీ క్లోరోథలోనిల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. పచ్చిపూత దశ ఉన్న తోటల్లో లీటర్ నీటికి 0.3 గ్రాములు థయామిథాక్సామ్ లేదా 1.5 మి.లీ బుప్రొఫెజిన్ + 2 మి.లీ హెక్సాకోనజోల్ లేదా 2 గ్రాములు మాంకోజెబ్, కార్బండిజమ్ కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. తోటలకు నీరు తక్కువగా పెట్టడంతో పాటు శుభ్రంగా ఉంచుకుంటే తెగుళ్ల ఉధృతి తగ్గుతుందని తెలిపారు.



ఆత్మకూరులో మామిడి రైతులకు సూచనలిస్తున్న నరసింహారావు

కొనసాగుతున్న పోలీస్ స్పోర్ట్స్ మీట్

అనంతపురం: స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ మూడో రోజు ఉత్సాహభరితంగా కొనసాగాయి. క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం రూరల్ సబ్‌డివిజన్ జట్టుపై పోలీసు ఏఆర్ విభాగం జట్టు గెలుపొందింది. అలాగే కబడ్డీ పోటీలు నిర్వహించారు. 200, 400 మీటర్ల పరుగు, రిలే పరుగు, జావెలిన్ త్రో, హైజంప్, లాంగ్ జంప్ పోటీలు ఉత్కంఠగా జరిగాయి.



లాంగ్ జంప్‌లో చేస్తున్న క్రీడాకారుడు

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

బొమ్మనహాళ్: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళుతున్న అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేసి రూ.7 లక్షలు విలువ చేసే 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం సాయంత్రం బొమ్మనహాళ్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను డీఎస్పీ రవిబాబు వెల్లడించారు. రాయదుర్గం, బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు, నేమకల్లు, ఉద్దేహాళ్, కణేకల్లు క్రాస్, బళ్లారి పట్టణంలోని వివిధ దుకాణాలు, దేవాలయాల ఎదుట నిలిపిన ఖరీదైన ద్విచక్ర వాహనాలు కొన్ని రోజుల్లో చోరీకి గురయ్యాయి. కేసులు నమోదు చేసిన పోలీసులు బృందాలుగా విడిపోయి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో శెట్టూరు మండలం అడవిగొల్లపల్లి గ్రామానికి చెందిన వడ్డే సురేష్ (పాత నేరస్తుడు) గురువారం బొమ్మనహాళ్ మండలం మీదుగా బళ్లారికి వెళుతుండగా నేమకల్లు క్రాస్ వద్ద ఎస్‌ఐ నబీరసూల్ అదుపులోకి తీసుకుని, విచారణ అనంతరం 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, సురేష్‌పై గతంలో బొమ్మనహాళ్ పీఎస్‌లో 3 కేసులు, కణేకల్లు పీఎస్‌లో 1, రాయదుర్గం పీఎస్‌లో 1, బళ్లారి పట్టణంలోని కౌలు బజారు పోలీస్ స్టేషన్‌లో ఒకటితో పాటు అదే రాష్ట్రంలోని పలు పీఎస్‌ల పరిధిలో చాలా కేసులున్నాయి.



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను చూపుతున్న పోలీసులు

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్ట్

గుంతకల్లు రూరల్: వివిధ చోరీ కేసులకు సంబంధించి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు గుంతకల్లు డీఎస్పీ ఎ.శ్రీనివాస్ తెలిపారు. గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 25న సాయంత్రం శంకరానంద గిరీ డిగ్రీ కళాశాల వెనక గుంతకల్లులోని మస్తాన్‌పేట కాలనీకి చెందిన బి.రఘుని సీఐ ప్రవీణ్ కుమార్, కసాపురం ఎస్‌ఐ వెంకటస్వామి అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం 14 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ నెల 26న కసాపురం పీఎస్ పరిధిలో తచ్చాడుతున్న గుంతకల్లులోని ఉమామహేశ్వర నగర్ కాలనీకి చెందిన షేక్ మస్తాన్‌వలిని అరెస్ట్ చేసి ఓ ద్విచక్ర వాహనం, 2.7 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



రాప్తాడు: సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రయాణికులతో బయలుదేరిన ఆర్టీసీ బస్సు మార్గమధ్యంలో నిలిచిపోయింది. వివరాలు... అనంతపురం బస్టాండ్ నుంచి రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లికి గురువారం ఉదయం 8 గంటలకు బయలుదేరిన బస్సు (ఏపీ29 జెడ్ 2537) నగర శివారులోని ధర్మవరం పంగల్ రోడ్డు వద్దకు చేరుకోగానే గేర్ బాక్స్ నుంచి శబ్దం రావడంతో వేగం తగ్గింది. అయితే బస్సులో ఉపాధ్యాయులు ఉండడంతో వారిని సకాలంలో పాఠశాలకు చేర్చాలనే తపనతో డ్రైవర్ మహేష్ చాకచక్యంగా వాహనాన్ని నడుపుతూ ముందుకు సాగాడు. ఈ క్రమంలో గంగలకుంట క్రాస్ వద్దకు చేరుకోగానే శబ్దం ఎక్కువై బస్సు ముందుకు కదలకుండా మొరాయించింది. విషయాన్ని వెంటనే డిపో మెకానిక్‌కు డ్రైవర్ మహేష్, కండెక్టర్ విజయలక్ష్మి తెలిపి, ప్రత్యామ్నాయ బస్సు పంపాలని కోరారు. అయితే బస్సు రావడంతో ఆలస్యం కావడంతో ఉపాధ్యాయులు, ఇతర అత్యవసర పనులపై ఉన్న వారు ఇతర వాహనాల్లో వారి గమ్య స్థానాలకు చేరుకున్నారు. దాదాపు అరగంట తర్వాత వచ్చిన మరో బస్సులో ప్రయాణికులను గమ్య స్థానానికి చేర్చారు. కాగా, కండీషన్ లేని బస్సులను తిప్పుతున్నారంటూ ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.

బాలుడి దుర్మరణం



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

డి.హీరేహాళ్(రాయదుర్గం): ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ బాలుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా మొలకాల్మూరు తాలూకా కొండ్లపల్లికి చెందిన ఓ కుటుంబం గురువారం ఉదయం సవదర్తి యల్లమ్మ ఆలయ దర్శనం కోసం ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో డి.హీరేహాళ్ మండలం పూలకుర్తిలో ఉన్న బంధువులనూ వెంట పిలుచుకెళ్లేందుకు సిద్ధమైన వారు కల్యం గ్రామం వద్ద యూటర్న్ తీసుకుంటుండగా ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో జగదీష్ (12) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు తిప్పేస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు. గటనపై డి.హీరేహాళ్ పీఎస్ ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎస్‌ఐకి ఎస్పీ పరామర్శ



మెడికల్ రిపోర్టు పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాడిపత్రి అర్బన్ ఎస్‌ఐ నాగవీరయ్యను ఎస్పీ పి.జగదీష్ గురువారం పరామర్శించారు. ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది పడిన ఆయనను తొలుత తాడిపత్రిలోని ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకున్నారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ గురువారం ఉదయం ఆస్పత్రికి చేరుకుని నాగవీరయ్యను పరామర్శించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి ఆత్మస్థైర్యం పెంపొందించారు. మెడికల్ రిపోర్టును పరిశీలించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

ఆర్మీ లిక్కర్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఆర్మీ లిక్కర్‌ను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

అనంతపురం: నగరంలో అక్రమంగా విక్రయిస్తున్న ఆర్మీ లిక్కర్‌ను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందిన పక్కా సమాచారంతో గురువారం తనిఖీలు చేపట్టిన ఎక్సైజ్ అధికారులు ఎస్. వెంకట్ అనే వ్యక్తి వద్ద ఉన్న 69 ఆర్మీ లిక్కర్ ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నాను. నిందితుడిపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎక్సైజ్ అధికారులు జయనరసింహం, జాకీర్ హుస్సేన్, కృష్ణారెడ్డి, విజయభాస్కర్, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థుల డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ, ఫార్మసీ విభాగాల్లో నిర్వహిస్తున్న ఎల్‌ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ ఇద్దరు విద్యార్థులు పట్టుబడ్డారు. వారిని డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. కాగా, పరీక్ష కేంద్రాలను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సి. లోకేశ్వర్లు తనిఖీ చేశారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

'బోధనా నైపుణ్యాలు మెరుగు పరుచుకోండి'

బుక్కరాయసముద్రం: బోధనా నైపుణ్యాలు మెరుగు పరుచుకోవాలని ఉపాధ్యాయులకు ఎన్‌సీఈఆర్‌టీ స్టేట్ అబ్జర్వర్ రంగయ్య సూచించారు. బీకేఎస్‌లోని జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న విజయ భారతి డీఈడీ కళాశాలలో 1, 2 తరగతి బోధించే ఉపాధ్యాయులకు 6 రోజుల ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగయ్య హాజరై, మాట్లాడారు. ఎన్‌ఈపీ 2020లో భాగంగా పునాది స్థాయి నుంచి అభ్యసనను పూర్తి స్థాయిలో మెరుగు పరిచేలా పాఠశాల విద్యాశాఖ ఎస్ఎస్ఏ, ఎన్‌సీఈఆర్‌టీ, వివిధ సంస్థల ద్వారా ముందుకు వెళుతోందన్నారు. అందుబాటులో ఉన్న టెక్నాలజీ ఉపయోగించుకుని బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓలు నారపరెడ్డి, రామచంద్ర, డైట్ కళాశాల అధ్యాపకుడు గోవిందరాజులు, కేఆర్పీ సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

28న జాబ్‌మేళా

గుంతకల్లు రూరల్: స్థానిక న్యాక్ ట్రైనింగ్ సెంటర్‌లో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు, డీఎస్‌డీఓ ప్రతాప్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సంయుక్త ఆధ్వర్యంలో మేళా సాగుతుందన్నారు.

చిన్నముష్టూరు పాలిటెక్నిక్ కళాశాలలో..

ఉరవకొండ: మండలంలోని చిన్నముష్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అష్రాఫ్‌అలీ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.వి ప్రతాప్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. యాక్సిస్ బ్యాంక్, రెడ్డి ఫౌండేషన్ సంస్థలతో పాటు ఇతర కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటాయి. డిప్లొమా, పీజీ, డిగ్రీ, ఇంటర్ పూర్తి చేసిన వారు అర్హులు. వివరాలకు 70138 00115లో సంప్రదించవచ్చు.

పాముకాటు... మహిళ మృతి

యాడికి: పాము కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... యాడికి మండలం చందన గ్రామానికి చెందిన రాళ్లచేని శ్రీరామనాయుడు, సక్కుబాయి(53) దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. దినసరి కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 23న వ్యవసాయ పనులకు వెళ్లిన సక్కుబాయి పని ప్రాంతంలో పాము కాటుకు గురైంది. తోటి కూలీలు వెంటనే ఆమెను రాయలచెరువులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుని సూచన మేరకు ఈ నెల 25న అనంతపురానికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సకు స్పందించక గురువారం మధ్యాహ్నం ఆమె మృతి చెందింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బీఎల్‌ఓలకు గౌరవ వేతనం మంజూరు

అనంతపురం అర్బన్: ఓటరు జాబితా సవరణ, ఎన్నికల విధులు నిర్వర్తించిన బూత్ లెవల్ అధికారులకు బకాయి ఉన్న గౌరవ వేతనం రూ.3.15 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఈనెల 24న ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 3,750 మంది బీఎల్‌ఓలకు మూడో త్రైమాసిక గౌరవ వేతనం రూ.750 చొప్పున, నాల్గో త్రైమాసి కానికి రూ.1,500 చొప్పున రూ.84,37,500 మంజూరు చేసింది. అదే విధంగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాలుగు త్రైమాసికాలకు కలిపి ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున 2,198 మందికి రూ. 1.31 కోట్లు, 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడు త్రైమాసికాలకు కలిపి ఒక్కొక్కరికి రూ.4,500 చొప్పున రూ.99,58,500 విడుదల చేసింది.

బీసీసీఐ అండర్-23 ఏపీ జట్టులో చోటు



మహేంద్ర రెడ్డి



బొమ్మన్న

అనంతపురం: బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-23 అంతర్రాష్ట్ర వన్ డే క్రికెట్ టోర్నీలో ప్రాతినిథ్యం వహిస్తున్న ఏపీ జట్టులో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. తాడిపత్రికి చెందిన కుడిచేతి మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ టి.మహేంద్రరెడ్డితో పాటు అండర్ -23 ఆంధ్రా ఉమెన్ జట్టుకు ఫిట్నెస్ ట్రైనర్‌గా బి.బొమ్మన్న ఎంపికయ్యారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో పురుషుల, జనవరి 4 నుంచి 12వ తేదీ వరకు రాజకోట్‌లో మహిళల క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. జట్టులో చోటు దక్కించుకున్న వారిని ఏడీసీఏ సెక్రెటరీ వి.భీమలింగారెడ్డి అభినందించారు.

మినీగోకులం షెడ్ల రద్దు

వజ్రకరూరు: మండలానికి మంజూరైన ఆరు మినీ గోకులం షెడ్లను రద్దు చేసినట్లు ఏపీఓ లక్ష్మీకాంత బాయి తెలిపారు. గురువారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ... వజ్రకరూరు మండలానికి తొలి విడుత కింద మొత్తం 72 మినీ గోకులం షెడ్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో ఇప్పటి వరకూ 66 మినీగోకులం షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. మరో ఆరు మినీ గోకులం షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాక పోవడంతో వాటిని రద్దు చేసినట్లు వెల్లడించారు. రద్దయిన వాటిలో వజ్రకరూరులో 2, పందికుంటలో 1, వెంకటాంపల్లిలో 2, పీసీ ప్యాపిలిలో 1 చొప్పున ఉన్నాయన్నారు.

రూ.20 కోసం యువకుడిపై దాడి

అనంతపురం: చికెన్ కబాబ్ తీసుకుని డబ్బు ఇవ్వమంటే ఇవ్వకుండా నిర్వాహకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ కె.సాయినాథ్ తెలిపారు. వివరాలు.. ఏ.నారాయణపురం పంచాయతీ, స్టాలిన్‌నగర్‌కు చెందిన అడపాల వెంకటేశ్ బళ్లారి బైపాస్‌లో భవిష్య చికెన్ కబాబ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం కబాబ్ సెంటర్‌లో ఉండగా, షెక్షావలి, బోయ సాయి తేజ్, రాము అనే ముగ్గురు యువకులు మద్యం సేవించి రూ.40 చికెన్ కబాబ్ తీసుకున్నారు. రూ.20 నగదు ఇచ్చి.. తక్కిన రూ.20 ఫోన్ పే చేస్తామని చేయలేదు. షాపు యజమాని డబ్బు అడగగా, అందరి ముందు తమను అసభ్యకరంగా తిట్టి అవమానపరిచావంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. తిరిగి రాత్రి 8 గంటల సమయంలో షేక్షావలి, బోయ సాయి తేజ, సాయిలతో మరోసారి వచ్చి రూ.100 చికెన్ కబాబ్ ఇవ్వాలని అడిగారు. ముందుగానే డబ్బు చెల్లించాలని షాపు యజమాని కోరారు. చికెన్ ఇవ్వకుంటే చంపుతామని బెదిరించి , అడపాల వెంకటేశ్, అతని అన్న కార్తీక్‌ను తీవ్రంగా కొట్టారు. ఈ నేపథ్యంలో డయల్ -100కు ఫోన్ చేయగా, దాడిలో పాల్గొన్న వాల్మీకి సాయితేజ, వాల్మీకి రామును అదుపులోకి తీసుకుని, మద్యం తాగి ఉన్నట్టుగా సర్టిఫికెట్ పొంది అరెస్ట్ చేశారు.



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



పూజలు చేస్తున్న హంపీ పీఠాధిపతి

గుంతకల్లు టౌన్: స్థానిక రైల్వేగ్రౌండ్ వద్ద వెలసిన లక్ష్మీగణేశ దేవాలయంలో గురువారం యంత్ర, ధ్వజస్తంభ ప్రతిష్టలు, మహాకుంభాభిషేకం వైభవంగా జరిగాయి. వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య హంపీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య విద్యారణ్యభారతి స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సురేష్‌గుప్త, కార్యదర్శి లక్ష్మీనారాయణగుప్త, కోశాధికారి దేవేంద్ర, అర్చకుడు పార్థసారథిశర్మ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలకు సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం క్రైం: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పని చేస్తూ వివిధ కారణాలతో మృతి చెందిన ఉద్యోగులకు సంబంధించి వారి పిల్లలకు కారుణ్య నియామకాల కింద పోస్టింగ్‌లు కల్పించే ప్రక్రియ వేగవంతమైంది. ఈ క్రమంలో గురువారం సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. సుమారు 80 మంది హాజరు కావాల్సి ఉండగా 79 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. కాగా, గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సర్టిఫికెట్ల పరిశీలన రాత్రి 7 గంటలైన పూర్తి కాక పోవడంతో ఎంత మంది హాజరయ్యారన్న వివరాలపై స్పష్టత లేదు. అధికారులు సైతం వెల్లడించలేకపోయారు. పరిశీలన ప్రక్రియ మందకొడిగా సాగడంతో అభ్యర్థులు అసహనానికి గురయ్యారు.

క్లుప్తంగా

బాలగొండ వీరనారప్పకు డాక్టరేట్



వీరనారప్పను అభినందిస్తున్న ప్రొఫెసర్ సదాశివారెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు, తులనాత్మక అధ్యయనశాఖలో పరిశోధన చేసిన బాలగొండ వీరనారప్పకు గురువారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఎస్ఆర్ సదాశివా రెడ్డి పర్యవేక్షణలో ' భాగవతంలోని మానవ సంబంధాలు–ప్రతిఫలనం ' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు.

విశా ఫెర్రర్‌కు అభినందనలు



విశా ఫెర్రర్‌కు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

అనంతపురం: సౌత్ ఇండియన్ ఉమెన్ అచీవ్‌మెంట్ అవార్డు దక్కిన సందర్భంగా విశా ఫెర్రర్‌కు పలువురు అభినందనలు తెలిపారు. మహిళా సాధికారితకు విశేషంగా కృషి చేస్తున్న సందర్భంగా ఈ అవార్డు దక్కడం అభినందనీయమని ప్రశంసించారు. ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ అధ్యక్షుడు కేపీ రాజు, ప్రధాన కార్యదర్శి తోట నాగరాజు, మీనాక్షమ్మ ఫౌండేషన్ అధినేత రవికాంత్ రమణ, కమలనాథ్, సాకే సుధాకర్, తరిమెల రాజు, పవన్ లింగాల, అమర్‌నాథ రెడ్డి, అడ్వొకేట్ చంద్రాచెర్ల హరి, శంకర్‌రెడ్డి, సుధాకర్ రాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



బైపాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ లక్ష్మీనరసింహ కోరారు. గురువారం ఆత్మకూరు బైపాస్ వద్ద సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ ధరించకపోతే ప్రమాదాలు చోటు చేసుకొని ప్రాణాలు పోయే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా కార్లు నడిపే వారు సీటు బెల్టు ధరించాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం



రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ విజయకుమారి

రాప్తాడు: భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించడం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ విజయకుమారి పేర్కొన్నారు. గురువారం ఎం.చెర్లోపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు అధికంగా భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. అనంతరం ప్రజలు, రైతుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో వీఆర్వో బాషా, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా మల్లికార్జునరెడ్డి



మల్లికార్జున రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాగమణి, పద్మ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి అడ్మినిస్ట్రేటర్‌గా మల్లికార్జున రెడ్డి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. అంతకుముందు ఆయన సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావును మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న మల్లికార్జున రెడ్డిని గ్రేడ్ – 1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, గ్రేడ్– 2 నర్సింగ్ సూపరింటెండెంట్లు రజిని, నాగమణి, స్టాఫ్‌నర్సు అసోసియేషన్ అధ్యక్షురాలు ఆర్‌బీ పద్మ, నేతలు లత, మహాలక్ష్మి, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆయన సిబ్బందికి సూచించారు. నంద్యాల డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఈయనను ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసిన విషయం విదితమే.

బోర్డు మాయం చేసేశారు..!

- ప్రభుత్వ భూమిలో వేసిన హెచ్చరిక బోర్డు తొలగింపు
- అక్రమార్కుల పనా.. దొంగల పనా?
- ఘటనపై సందేహాలు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి సమీపంలోని 235 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఎత్తుకెళ్లారు. నాలుగు రోజుల కిందట ఈ బోర్డు ఎత్తుకెళ్లినా అటు రెవెన్యూ అధికారులు కానీ, ఇటు పంచాయతీ అధికారులు కానీ ఆవైపు కన్నెత్తి చూడక పోవడం పట్ల స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బోర్డును నిజంగా దొంగలు ఎత్తుకెళ్లారా? లేదంటే అక్రమార్కులు పనేనా? అన్న చర్చ జరుగుతోంది. వివరాల్లోకి వెళితే.. పూర్వం బసవశెట్టి లక్ష్మమ్మ అనే ప్రభుత్వ ఉద్యోగినికి ఈ భూమి అసైన్డ్ చేశారు. ఈమెకు ముగ్గురు కుమార్తెలు సంతానం. లక్ష్మమ్మ మరణానంతరం బసవశెట్టి కాంతమ్మ పేరును రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించారు. ఈమెకు సంతానం లేరు. దీంతో ఈమె సోదరి కుమారుడు తనపేరు మీద నకిలీ మ్యాన్యువల్ పాస్‌బుక్కు సృష్టించుకున్నాడు. దీని ఆధారంగా భూమి తనదేనంటూ ప్రచారం చేసుకునేవాడు. దీనికితోడు కాంతమ్మకు చెందిన మరో ఇద్దరు కుమారులు దీంట్లో తమకు వాటా ఉందంటూ హైకోర్టును ఆశ్రయించారు. రెవెన్యూ అధికారులు మాత్రం ఎవరికీ సంబంధం లేదని ఇది ప్రభుత్వ భూమిగా తేల్చారు. ఈ వివాదం నడుస్తూనే ఉంది.



రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



బోర్డు ఎత్తుకెళ్లడంతో ఖాళీగా ఉన్న ప్రదేశం

భూమిపై టీడీపీ నేతల కన్ను..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి కుమారుడి పేరు చెప్పుకుంటూ కొందరు టీడీపీ చోటా నాయకులు ఈ భూమిపై కన్నేశారు. కారుచౌకగా కొట్టేసి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకోవాలని పన్నాగం పన్నారు. నకిలీ పాస్‌బుక్ కల్గిన కాంతమ్మ కుమారుడితో కొనుగోలు చేసినట్లు అగ్రిమెంట్ రాయించుకుని రంగంలోకి దిగారు. అంతే ఎంచక్కా చదును చేసేసి ప్లాట్లు వేశారు. సెంటు రూ.3 లక్షల వరకు నిర్ణయించి మార్కెట్‌లో ఉంచారు. దీనిపై 'సాక్షి'లో 'ప్రభుత్వ భూమి..ప్రైవేట్ లేఔట్!' శీర్షికతో గత నెలలో ప్రత్యేక కథనం వెలువడింది. కలెక్టర్ వినోద్ కుమార్ స్పందించారు. ప్రభుత్వ భూమిని అడ్డగోలుగా అమ్మకానికి పెట్టడంపై రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తహసీల్దార్ మోహన్‌కుమార్ రంగంలోకి దిగారు. వెంటనే ఆ భూమిలో బోర్డు నాటాలని ఆదేశించారు. ఈ క్రమంలో వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఏ స్వయంగా వెళ్లి ఈ భూమిలో హెచ్చరిక బోర్డు నాటించారు. 'ఎవరైనా నిర్మాణాలు చేపట్టినా, క్రయవిక్రయాలు జరిపినా క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు పీఓటీ 9/77 ప్రకారం ఆర్నెళ్ల పాటు శిక్ష ఉంటుంద'ని హెచ్చరించారు. అయినా ఈ హెచ్చరికలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా బోర్డు ఎత్తుకెళ్లడంపై అనుమానాలు కలుగుతున్నాయి. ఇందులో రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది సహకారంపై కూడా చర్చ జరుగుతోంది.


కేసు నమోదు చేయిస్తాం

కొడిమి పొలం 235 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఎత్తుకెళ్లడాన్ని సీరియస్‌గా తీసుకుంటాం. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం. ఎవరైనా దొంగలు ఎత్తుకెళ్లారా? లేదంటే పనికట్టుకుని తొలిగించారా? అనేది విచారిస్తాం. ప్రభుత్వ భూమిలోకి ఎవరైనా అక్రమంగా ప్రవేశిస్తే మాత్రం కేసు నమోదు చేయిస్తాం.

–మోహన్‌కుమార్, తహసీల్దార్
అనంతపురం రూరల్

'పోరుబాట'ను జయప్రదం చేయండి

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రాప్తాడు: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ రాప్తాడు విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం తలపెట్టిన పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని ప్రకటించిన చంద్రబాబు నాయుడు కరెంటు చార్జీలు పెంచి రూ.15 వేల కోట్ల మేర భారాన్ని మోపి నిలువునా మోసం చేశారన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.6 వేల కోట్లు, సర్‌చార్జీల పేరుతో రూ.9 వేల కోట్లు ప్రజలపై పన్ను భారం మోపుతున్నారన్నారు. అధికారంలోకి రావడానికి కూటమి పార్టీలు అబద్ధపు హామీలిచ్చి ప్రజలను మోసం చేశాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలపై కరెంట్ చార్జీల పేరుతో బాదుడు కార్యక్రమానికి తెర లేపాయన్నారు. ఉదయం 9 గంటలకు వైఎస్సార్ నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలతో కలిసి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఆత్మకూరు: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ రాప్తాడు విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం తలపెట్టిన పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ సుబ్బర హేమలత కోరారు. ఈ మేరకు ఆమె గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుదామన్నారు.

ప్రభుత్వానికి కనువిప్పు కల్గిద్దాం

అనంతపురం కార్పొరేషన్: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయడం ద్వారా ప్రభుత్వానికి కనువిప్పు కలిగిద్దామని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరపాలక సంస్థలోని తన చాంబర్‌లో కోగటం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక వైఖరిపై ఆయన ధ్వజమెత్తారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగే నిరసన ర్యాలీకు భారీ ఎత్తున తరలిరావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గతంలో కరెంటు తీగలను పట్టుకుంటే షాక్ కొట్టేదని, కూటమి ప్రభుత్వంలో కరెంటు బిల్లు పట్టుకుంటుంటే షాక్ కొట్టే పరిస్థితి నెలకొందన్నారు. విద్యుత్ చార్జీలను పెంచబోమని, సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామన్న సీఎం చంద్రబాబు మాట తప్పారన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రజలను దగా చేస్తున్నారన్నారు. విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై రూ.15 వేల కోట్లకు పైగా భారం పడుతోందన్నారు. ప్రజల ఆర్థిక స్థితిగతులను దెబ్బతీసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో పింఛన్ మినహా మిగితా హామీలను అమలు చేయలేదన్నారు. కార్పొరేటర్లు అబూసలేహ, లాలు, చంద్రమోహన్ రెడ్డి, మునిశేఖర్, జయలలిత, నాయకులు రామచంద్ర, పురుషోత్తం, నాగరాజు, రవి, అవైజ్ హాజిరి, పవన్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి

అమిత్‌షా వ్యాఖ్యలు గర్హనీయం



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అనంతపురం అర్బన్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నాయకుల గురువారం ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న అమిత్ షా అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు దేశ పునాదిని ధ్వంసం చేయడమే అవుతుందన్నారు. అమిత్‌షాను కేంద్ర హోం మంత్రి పదవి నుంచి తక్షణం తొలగించాలన్నారు. అలాగే అమిత్‌షా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఓ ఎ.మలోలను నాయకులు ఆయన చాంబర్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఏపీసీసీ మైనారిటీ సెల్ రాష్ట్ర చైర్మన్ దాదాగాంధీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాండురంగని నిజరూప దర్శనం



పూజలందుకున్న రుక్మిణీ విఠల పాండురంగడు

అనంతపురం కల్చరల్: నగరంలోని రామనగర్ రుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయంలో గురువారం వచ్చిన సఫల ఏకాదశి సందర్భంగా రుక్మిణీ విఠల పాండురంగ నిజరూప దర్శనం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అంతకు ముందు కృష్ణనామ సంకీర్తనతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు దుస్తకర్ తిరుపతి రావు, సెక్రటరీ ఆనంద్ మహేంద్రకర్ మాట్లాడుతూ భక్తులకు ప్రతి ఏకాదశికి నిజరూప దర్శన భాగ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవం

అనంతపురం అర్బన్: స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో గురువారం సీపీఐ శత వార్షికోత్సవాలను ఆ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. కార్యక్రమానికి నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షత వహించారు. జాఫర్ మాట్లాడుతూ తమ పార్టీ బడుగు బలహీనవర్గాల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాడుతోందన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, నాయకులు లింగమయ్య, మల్లికార్జున, సంతోష్‌కుమార్, రమణ, అల్లీపీరా, రాజేష్‌గౌడ్, కృష్ణుడు, చిరంజీవి, వరలక్ష్మి, కుళ్లాయిస్వామి, భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: ప్రజా సమస్యలపై సీపీఐ అలుపెరుగని పోరాటాలు చేస్తోందని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున అన్నారు. గురువారం కందుకూరు క్రాస్‌లోని సీపీఐ కాలనీలో మండల కార్యదర్శి చలపతి ఆధ్వర్యంలో సీపీఐ పార్టీ 100వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా సీపీఐ జెండాను ఎగురవేశారు. సీపీఐ, రైతు సంఘం నాయకులు రాము, మల్లప్ప, రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, నాయకులు

ఆత్మకూరు: సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు రామాంజినేయులు, సరస్వతి, నల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వసంతోత్సవాలను గురువారం అనంతపురం రూరల్ మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ సోములదొడ్డిలో పార్టీ జెండా ఆవిష్కరించారు. సీపీఐ ఉద్యమాల ఫలితంగానే వందలాది కాలనీలు ఏర్పాటయ్యాయన్నారు. మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ సీపీఐ పోరాటాల కారణంగానే శత వసంతోత్సవ వేడులకు పేదలు స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. కక్కలపల్లికాలనీలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేశవరెడ్డి, ఆకుతోటపల్లిలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి అన్నగిరి పద్మావతి, మన్నీల గ్రామంలో గిరిజన సమాఖ్య నాయకులు గుండ్లకొండ రామాంజనేయులు, ఐజీ నగర్‌లో రమేష్, ఎన్ఆర్‌కాలనీలో జి.శ్రీకాంత్, రూరల మండల సహాయ కార్యదర్శి నరేష్ జెండా ఆవిష్కరించారు. అలాగే ధర్మభిక్షం కాలనీలో ఏఐటీయూసీ నాయకులు పోతులయ్య, పూలకుంట గ్రామంలో అజయ్‌కుమార్, కందకూరులో వెంకటరాముడు, రావి నారాయణరెడ్డి కాలనీలో వెంకటరాముడు, కృష్ణంరెడ్డిపల్లిలో రైతు సంఘం నాయకులు నగేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

వైభవంగా భీమరథశాంతి మహోత్సవం

అనంతపురం కల్చరల్: సాయిట్రస్టు ఆధ్వర్యంలో గురువారం 170 మంది వృద్ధులకు షష్టిపూర్తితో పాటూ భీమరథశాంతి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక గుత్తిరోడ్డులోని శ్రీ కన్వెన్షన్ హాలులో జరిగిన వేడుకలను తిరుక్కడయూరి అమ్మవారి క్షేత్రం నుంచి పలువురు స్వాముల వారు అనంతకు విచ్చేసి మంగళ స్నానాలు, గోపూజలు వంటి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే వేదపండితులు బాలాజీ శర్మ, గిరిప్రసాద్ బృందాలు ఉదయం షష్టిపూర్తి చేసుకున్న దంపతులతో మహాశివునికి రుద్రాభిషేకాలు, వేంకటేశ్వర కల్యాణం, సీతారాముల కల్యాణం, శివపార్వతుల కల్యాణం, రుద్ర హోమాలను సంప్రదాయరీతిలో జరిపించారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ సాయిట్రస్టు తరపున విజయసాయి చేస్తున్న పలు సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాల రూపకల్పన అభినందనీయమన్నారు. కార్యక్రమానికి రూ.1.5 లక్షలు రుక్మిణీని ప్రత్యేకంగా అభినందించారు. షష్టిపూర్తి నోచుకోని జంటలకు ఈ విధంగా పెద్ద ఎత్తున జరిపించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వందలాది మందికి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ట్రస్టు అధినేత విజయ్‌కుమార్, అంబటి అఖిల్, రాఘవేంద్ర, నాయక్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

సేవాదృక్పథం అలవర్చుకోవాలి

అనంతపురం సెంట్రల్: పిల్లలు సేవా దృక్పథం అలవర్చుకోవాలని ఐసీడీఎస్ పీడీ వనజాఅక్కమ్మ పేర్కొన్నారు. పంగల్‌రోడ్డు సమీపంలోని ఆర్డీటీ విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో ఈనెల 21 నుంచి పిల్లలకు క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించారు. గురువారం వీర్ బాల్ దివస్ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. గురుగోవింద్ కుమారుడు సాహిబ్జదాస్ బాబా , బాబా ఫతేసింగ్ త్యాగాలకు గుర్తుగా వీర్ బాల్‌దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న పీడీ వనజాఅక్కమ్మ

డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోండి



ఆత్మకూరు వద్ద డ్రిప్‌ను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న డ్రిప్ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి సూచించారు. గురువారం ఆత్మకూరు సమీపంలోని డ్రిప్ పరికరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయనమ మాట్లాడుతూ ఐదెకరాలలోపున్న రైతులకు 90 శాతం, ఐదెకరాలు పైన ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీతో ప్రభుత్వం డ్రిప్ పరికరాలు అందిస్తోందన్నారు. దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోనే రైతులకు పరికరాలు అందిస్తామని తెలిపారు. ఎఫ్‌సీఓలు పులగూరు ఓబుళరెడ్డి, బాలు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయాభివృద్ధికి కృషి

అనంతపురం కల్చరల్: షిర్డీసాయి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఆలయ నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గురువారం నగరంలోని మూడోరోడ్డు షిర్డీసాయి మందిరం అధ్యక్షుడిగా గంగన లక్ష్మిరెడ్డితో పాటు పాలక మండలి సభ్యులు ప్రమాణం చేశారు. షిర్డీసాయి సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జయచంద్రచౌదరి నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. లక్ష్మిరెడ్డితో పాటూ ఉపాధ్యక్షుడిగా గంగిరెడ్డి, శశిధర్, ప్రధాన కార్యదర్శిగా నాగేంద్ర ప్రసాద్, సెక్రటరీగా రఘురామారావు, జాయింట్ సెక్రటరీలుగా సోమర జయచంద్రనాయుడు, మధుసూదన్, ట్రెజరర్‌గా సతీష్‌కుమార్ సాయినాథుని విగ్రహం ముందు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా జయచంద్ర చౌదరి మాట్లాడుతూ లక్ష్మిరెడ్డి మున్సిపల్ కో ఆప్షన్ మెంబరుగా ఉంటూ జనానికి నిత్యం అందుబాటులో ఉంటారని, ఆయన అధ్యక్షుడు కావడం సంతోషకరమన్నారు. అనంతరం లక్ష్మిరెడ్డిని పాలక మండలి సభ్యులు సత్కరించారు.



లక్ష్మిరెడ్డిని సత్కరిస్తున్న పాలక మండలి సభ్యులు

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన దుర్గేష్

బెళుగుప్ప: మండలంలోని నరసాపురం వద్ద గురువారం రాత్రి ద్విచక్ర వాహనం, లారీ ఢీకొన్న ప్రమాదంలో దుర్గేష్ (28), భారతి(24) దంపతులకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. ఒంటిమిద్దికి చెందిన దుర్గేష్ అత్తగారి ఊరు అయిన బెళుగుప్ప మండలం నరసాపురానికి భార్యతో కలిసి వెళ్తుండగా జాతీయ రహదారిపై లారీ ఢీకొనింది. గాయపడిన వీరిని 108 వాహనంలో కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు

బొమ్మనహాళ్:మండలంలోని చంద్రగిరి గ్రామంలో బొలప్పగారి చంద్ర అనే వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనానికి దుండగులు బుధవారం అర్ధరాత్రి నిప్పుపెట్టారు. ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్‌కు నిప్పు పెట్టారు. దీంతో పూర్తిగా కాలిపోయింది. మంటలు ఎక్కువగా రావడంతో పొరుగింట వారు చంద్రను నిద్రలేపారు. అయితే అప్పటి వాహనం పూర్తిగా కాలిపోయింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపటి నుంచి సిద్ధి గణపతి యాగం

అనంతపురం కల్చరల్: శ్రీజ్ఞానపీఠం, గుహానంద మండలి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నుంచి సిద్ధి గణపతి యాగాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు విద్యానందనాథ స్వామీజీ తెలిపారు. స్థానిక రెండవరోడ్డులోని శ్రీజ్ఞానపీఠం ఆశ్రమంలో గురువారం పోస్టర్లను ఆవిష్కరించారు. శనివారం ఉదయం గణపతి పూజతో ప్రారంభించి మహా సంకల్పం, కలశస్థాపన, గణపతి ఆవరణార్చన, సహస్రానృత ఆథర్వశీర్ష పారాయణం, హోమం జరుగుతాయన్నారు. ఆదివారం గణపతి మూల మంత్రాన్ని నిర్విరామంగా జపిస్తూ అష్టద్రవ్యాలతో హోమం సాగుతుందన్నారు. అలాగే వాంఛాకల్పలత గణపతి హోమం, ప్రత్యక్ష అష్టగణపతి పూజ, మహా పూర్ణాహుతి జరుగుతాయని రెండు రోజుల పాటూ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. సనాతన ధర్మంలో భాగంగా లోక క్షేమం కోసం సాగే యాగాన్ని అందరూ దర్శించుకుని తీర్థప్రసాదాలందుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీజ్ఞానపీఠం, గుహానందమండలి ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులు

షిర్డీ క్షేత్రంలో అనంత చిన్నారుల ప్రతిభ

అనంతపురం కల్చరల్: షిర్డీ సాయి సంస్థాన్ పుణ్యక్షేత్రంలో 'నిత్య కళారాధన' పేరుతో దేశ వ్యాప్తంగా ఉన్న కళాకారులను నిత్యం కొద్ది మందికి సాయినాథుని ముందు కళాప్రదర్శనకు అవకాశం కల్పిస్తున్నారు. ఆ నేపథ్యంలో గురువారం నగరానికి చెందిన అరవింద నృత్య శిక్షణాలయం సురేష్ మాస్టర్ శిష్యబృందం నాట్య ప్రదర్శన అద్భుతంగా సాగింది. బాబా హారతి పాటలతో పాటూ త్యాగయ్య, పురంధర సంకీర్తనలతో నాట్య మయూరి అవార్డు తెచ్చుకున్న హరిత, ఆరభి, సహస్ర ఆహూతులను మంత్రముగ్దులను చేశారు. అనంతరం చిన్నారులతో పాటూ డ్యాన్స్ మాస్టర్‌ను అభినంద సత్కారంతో గౌరవించారు.



నాట్యంతో ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన